లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తాం

● రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్/ గోపాల్‌పేట, మార్చి 3: కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతంగా చేపట్టేలా పనులు మొదలు పెడతామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చెప్పారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీ-8 కాల్వనుంచి రామన్నగట్టును రిజర్వాయర్ చేసి కాశీంనగర్ తండాలు, దత్తాయిపల్లి, అంజనగతిరి, తిరుమలాపూర్, అప్పాయిపల్లి ప్రాంతాలకు మూడు కాల్వల ద్వారా 4వేల ఎకరాలు రూ.62కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. 13తండాలు, 6 గ్రామాల పొలాలకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. డీ-8 కాల్వ సామార్థ్యం పెంపు, భూ సర్వే పనులు వేసవిలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇటీవల కాలంలో ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మానిటరింగ్ చేయడం లేదని ఇంజినీరింగ్ వ్యవస్థ కుప్పకూలిందన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను, బహిరంగ సభను విజయవంతం చేసిన మహిళలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపురంలో సోమవారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, హెల్త్‌సెంటర్, వెటర్నరీ సెంటర్‌ను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరిశీలించారు. గణితం, ఇంగ్లిష్ పుస్తకాలను హెచ్ఎం నర్సింహాకు అందజేశారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కమ్మర్‌మియా, కోట్ల రవి, యాదయ్య, రవి, ఎండీ బాబా, పెంటన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 3: జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి వెల్లడించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల విస్తరణ, జెఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణం, వనపర్తి రింగ్‌రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా మాజీ ప్రజాప్రతినిధులు కిచ్చారెడ్డి, చీర్ల చందర్, వెంకటేశ్, సతీశ్‌యాదవ్ ఉన్నారు.

వేసవి పంటలకు తడి అందించేందుకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వనపర్తి టౌన్, మార్చి 3: జిల్లాలో యాసంగి పంటలకు సకాలంలో తడి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి యాసంగి పంటలు, ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, మెనూప్రకారం గురుకులాల్లో భోజనం వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు, విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, ఈ ఏడాది 1.41లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని, ఏదుల, పెబ్బేర్ మండలాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, కేఎల్‌ఐ జూరాల ద్వారా నీరు వదిలితే సమస్య తీరుతుందని అధికారులకు ఆమె అధికారులకు సూచించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అధికారులు గోవిందునాయక్, రాజశేఖర్, సత్యనారాయణ, డీఈలు, ఈఈలు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి : డీఎస్పీ మోగిలయ్య

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

గద్వాల అర్బన్, మార్చి 3 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై పోలీస్ అధికారులు స్పందించాలని డీఎస్పీ మోగిలయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఎనిమిది మంది ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదుదారుల వినతులను డీఎస్పీ స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి ఆయా పోలీస్ అధికారులకు బాధితుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో గద్వాల, అలంపూర్, శాంతినగర్ సీఐలు శ్రీను, రవిబాబు, టాటాబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

● డీఐఈవో హృదయ రాజు

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో హృదయ రాజు

మల్దకల్, మార్చి 3 : ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని డీఐఈవో హృదయ రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణ ఆధ్వర్యంలో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత విద్యార్థులు కూడా మంచిగా చదువుకొని కళాశాల పేరును నిలబెట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థికి వృత్తి విద్యా కోర్సుల్లో చదివేందుకు గానూ మన కళాశాలకు చాలా ట్రస్టులు సహాయం చేస్తాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శ్రీనివాసులు, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

ANJANEYA DEGREE COLLEGE
Pebbair, 509104,Wanaparthy, Ph: 8297855208.
(Affiliated to Palamuru University)
WANTED LECTURERS
Application are invited from the qualified candidates for the following
***Subjects:*Telugu, English, History, Political Science, Economics, Commerces, Computer Science.**
Qualification : P.G. in the concerned subject with minimum 55% of marks from any recognised University. Candidates may send their Biodata with Xerox Copies of Certificates on or before 08-03-2025, they will be called for demonstration followed by an interview.
Sd/- Principal / Correspondent

VEERABHADRA DEGREE COLLEGE
Pebbair, 509104, Wanaparthy Dist.(TS), Ph: 9885963770.
(Affiliated to Palamuru University)
WANTED LECTURERS
Application are invited from the qualified candidates for the following
***Subjects:* Telugu, English, Mathematics, Physics, Computer Science, Botony, Zoology, Chemistry, History, Political Science, Economics.**
Qualification : P.G. in the concerned subject with minimum 55% of marks from any recognised University. Candidates may send their Biodata with Xerox Copies of Certificates on or before 08-03-2025, they will be called for demonstration followed by an interview.
Sd/- Principal / Correspondent

నిబంధనలకు అనుగుణంగా
అనుమతులు ఇవ్వాలి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మార్చి 3: జిల్లాలోని డయాగ్నోస్టిక్ సెంటర్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో క్లినికల్ సెంటర్లు, డెంటల్ ఆస్పత్రులు నెలకొల్పేందుకు అనుమతుల కోసం పెట్టుకున్న దఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులో పొందుపరిచిన విషయాలు, దవాఖానల్లో ఉన్న సదుపాయాలు, డాక్టర్ల వివరాలు పరిశీలించారు. క్లినికల్ యాక్ట్ ప్రకారం అన్ని సరిగ్గా ఉన్న వాటికి అనుమతులు మంజూరు చేశారు. అదనపు కలెక్టర్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పూర్తిచేయాలి..

మార్చి 17నాటికి జిల్లాలో క్షయవ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో క్షయవ్యాధి, మధుమేహం, పిల్లలకు టీకాల కార్యక్రమంపై వైద్యాధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఎక్స్‌రే, స్పూటం పరీక్షల ద్వారా పరీక్షలుచేసి క్షయవ్యాధి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. జిల్లాలో 1.60లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1.26లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని, దీనిని వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 281 మంది క్షయవ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించామని, క్షయవ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్‌లో ఉంటూ వారికి పూర్తి చికిత్స అందించాలన్నారు. మిగిలిన వారిని మార్చి 20వరకు వైద్యపరీక్షలు పూర్తిచేయాలని ఆదేశించారు. మధుమేహంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించి జిల్లాల్లో మధుమేహం వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించాలని సూచించారు. జిల్లాల్లో ఇప్పటివరకు 23వేలమంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు ఏ ఒక్కటి పెండింగ్‌లో ఉంచొద్దని ఆదేశించారు. గర్భిణులకు సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ దవాఖానలో సుఖ ప్రసవాలు జరిగేవిధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలియోరహిత సమాజం కోసం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ క్యాలెండర్‌ను వైద్య సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు సాయినాథ్, పరిమళ, రాచంద్రరావు, మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 22ఫిర్యాదులు వచ్చాయని, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అంటే పచ్చని పంటలు.. రేవంత్ అంటే పచ్చి అబద్ధాలు

● సీఎం తన స్థాయిని మరచి మాట్లాడుతున్నారు

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్

మాట్లాడుతున్న కురువ విజయ్‌కుమార్

గద్వాల, మార్చి 3 : కేసీఆర్ అంటే పచ్చని పంటలు.. రేవంత్ అంటే పచ్చి అబద్ధాలు అని తెలంగాణ ప్రజలకు అర్థమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 2వ తేదీన వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన సమయంలో తన స్థాయిని మరచి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై దిగజారుడు భాష మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వనపర్తి సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చిల్లర మాటలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. నీకు కేసీఆర్‌ను తిట్టడం తప్పా ప్రజలకు పనికి వచ్చే విషయం ఒక్కటి కూడ మీరు మాట్లాడం లేదన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీల గురించి మాట్లాడం చేతకాక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నావని ఆరోపించారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులకు కృష్ణాబేసిన్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించేకాక ఏ ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో మొదలు పెట్టిన కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడ్, కోయిల్‌సాగర్ లాంటి పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా చేసి 12లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా మహబూబ్‌నగర్‌లో 1544 చెరువులు, నాగర్‌కర్నూల్ 2024, నారాయణపేటలో 950, గద్వాలలో 563, వనపర్తిలో 1329 మొత్తం 6410 చెరువుల కింద 3.22లక్షల ఎకరాలు స్థిరికరించామని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 12లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పాలమూరు బిడ్డల కష్టాలను కేసీఆర్ తీర్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేసీఆర్ అంటే పచ్చని పంటలు, రేవంత్ అంటే పచ్చి అబద్ధాలని ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు యథేచ్ఛగా రోజుకు 10వేల క్యూసెక్కుల నీటిని తరలించుకపోతుంటే అడ్డుకోవాలన్నారు. పదేపదే కేసీఆర్‌ను 811 టీఎంసీలలో 512 ఆంధ్రకు, 299 తెలంగాణకు ఒప్పుకున్నాడని తప్పుడు మాటలు మాట్లాడే రేవంత్‌రెడ్డి, తెలంగాణ వచ్చిన మొదటి సంవత్సరంలో తాత్కాలిక ఒప్పందాన్ని మాత్రమే చేసుకున్నారని, మరుసటి ఏడాది నుంచి 50శాతం నీటి కేటాయింపులు ఉండాలని పేర్కొన్నారు. 2015 జూన్ 18, 19 తేదీలో జరిగిన అంతరాష్ట్ర మీటింగ్ యొక్క మినిట్స్ చూస్తే వాస్తవాలు తెలుస్తాయని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

రైతులను నట్టేట ముంచిన రేవంత్ సర్కారు

● బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కురువ పల్లయ్య

గద్వాల, మార్చి 3 : రైతులను నట్టేట రేవంత్‌రెడ్డి సర్కారు ముంచిందని బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయిలో రైతు భరోసా ఇస్తారని, రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,81,919 మంది రైతులుంటే ఇప్పటి వరకు మూడు ఎకరాల లోపు కేవలం 98,839 మంది రైతులకు మాత్రమే రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మిగతా రైతులకు రైతు భరోసా ఎప్పుడు ఇస్తారని రూ.2లక్షలు రుణమాఫీ కాని రైతులకు ఎప్పటి లోగా రుణమాఫీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 431పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఈ ఆత్మహత్యలు అన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలే అని పేర్కొన్నారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల కళ్లలో ఆనందం ఉండేదని, కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్లలో కన్నీళ్లు చూస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టుకొని హామీలపై నిలదీయాలని సూచించారు. తల్లికి అన్నం పెట్టనోడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాననే చందంగా రేవంత్‌రెడ్డి వైఖరి,పాలన ఉందన్నారు. కేసీఆర్ పాలనలో నాట్లు వేసేటప్పుడు రైతుబంధు పైసలు రైతుల ఖాతాలో జమచేస్తే, కాంగ్రెస్ పాలనలో ఓట్లప్పుడు మాత్రమే రైతుభరోసా వేసి రైతులను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా మెడలు వంచుతామని స్థానిక సంస్థల ఎన్నికల్లో అడుగడున అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాల్, కేశన్న, షఫీ, వీరేశ్ పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

ధరూరు, మార్చి 3 : డ్రంకన్ డ్రైవ్, బహిరంగ మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్సై కొండ శ్రీహరి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ పరిసరాలలో, వైఎస్సార్ చౌరస్తాలో ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఐదుగురు యువకులు మద్యం తాగి పట్టుబడగా ఆయన వారిపై బహిరంగ మద్యం, డ్రంకన్ డ్రైవ్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మానవపాడు, మార్చి 3 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముద్ర, పీఎంఈజీపీ రుణాలను స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ చైతన్య పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచి కార్యాలయం వద్ద పల్లెపాడు, గోకులపాడు గ్రామాలకు చెందిన శైలజ, అనురాధ, రామలక్ష్మి, మమతలకు రుణాలకు సంబంధించిన చెక్కులను బ్యాంకు మేనేజర్ అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోకులేశ్వర్‌రెడ్డి, ఏపీఎం బీమన్న, వీవోఏ గోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

అయిజ, మార్చి 3 : పీసీఎస్‌లు రైతులతోపాటు ప్రజల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీసీసీబీ సీఈవో పురుషోత్తం రావు అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం డీసీసీబీ సీఈవో అయిజ పీఏసీసీఎస్‌ను తనిఖీ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూతన డీసీసీబీ బ్యాంకుల బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. అయిజ సింగిల్ విండోలో మొట్టమొదటి సారిగా సూపర్‌మార్కెట్‌ను ఏర్పాటు చేశామని, జనవరిలో రూ.30లక్షల టర్నోవర్ సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, గద్వాల బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పాన్‌గల్, మార్చి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ప్రభుత్వ పథకాల అమలుపై ఇంటింటి సర్వేతోపాటు ఉపాధికూలీల స్థితిగతులపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటుందని తెలిపారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలుచేయలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ పేదలపై పెనుభారం మోపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్య, భగవంతు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల తనిఖీ

అమరచింత, మార్చి 3: మరో రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య సోమవారం ఆత్మకూర్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలను పరిశీలన చేసి పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ భాగ్య వర్ధర్‌రెడ్డిని అడిగి ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారనే వివరాలతోపాటు రిజిష్టర్లను పరిశీలించారు. ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనతోపాటు డీఈసీ సభ్యుడు నరేంద్రకుమార్, రాజశేఖర్, డీఐఈవో సూపరింటెండెంట్ నరేశ్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రేవల్లి, మార్చి 3: విద్యుదాఘాతంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో నాగపూర్ శివారులో చోటుచేసుకున్నది. ఏఎస్సై మల్లయ్య తెలిపిన వివరాల మేరకు బండరావిపాకులకు చెందిన తలారి చిన్న నాగయ్య (59) రోజుమాదిరిగానే ఉదయాన్నే తన వ్యవసాయ పొలానికి నీరు పారించేందుకు స్టార్టర్ ఆన్ చేయగా బోరు మోటార్‌కు ఉన్న కేఎల్ఐ కాల్వ నీటిలో దిగగా పైపు పక్కనే ఉన్న కరెంట్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న కొందరు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు తెలియజేయడంతో పోలీస్‌సిబ్బంది, విద్యుత్‌శాఖ ఏఈ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు

● కలెక్టర్ సంతోష్

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

గద్వాల, మార్చి 3 : ప్రజల సమస్యల పట్ల అధికారులు ఎవరు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

అయిజ, మార్చి 3 : అయిజ పట్టణంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పలు ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పట్టణంలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహం పెద్దవాగుపై నిర్మించిన హైలెవల్ వంతెన కారణంగా విగ్రహం దిగువకు కూరుకుపోయిందని, కొత్తగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు, ప్రభుత్వమే కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు నాయకులు తెలిపారు. ఏప్రిల్ 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి నాటికి కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మధుసూదన్‌బాబు, వెంకట్రాములు, పల్లయ్య, మబ్బుల్, రహీమాన్ పాల్గొన్నారు.

చేయూత పథకంలో అవకాశం కల్పించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

గట్టు, మార్చి 3 : నేతన్నకు చేయూత పథకంలో మాకు అవకాశం కల్పించాలని మండలంలోని కొత్తపల్లి గ్రామ చేనేత కార్మికులు కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వినతిపత్రం సమర్పించారు. కొన్ని సంవత్సరాలుగా చేనేత వృత్తిపై జీవనాధారం కొనసాగిస్తు ఉన్నాము. ఇప్పటివరకు ప్రభుత్వ సంక్షేమ పతకాలలో తమకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఇకనైనా చొరవ చూపి మాకు సంక్షేమ పతకాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు మోహన్, వీరేశ్, శ్రీరామ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

తాసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

వడ్డేపల్లి, మార్చి 3 : వడ్డేపల్లి రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ ఆంజనేయులు అలంపూర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో మానవపాడులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సర్దార్ మియా వడ్డేపల్లి కార్యాలయ ఆర్ఐగా సోమవారం బాధ్యతలు చేపట్టారని ఉప తాసీల్దార్ శ్రీకాంత్‌రె